# ఇక అన్నింటికీ ఆధార్ తప్పనిసరి

- పదేళ్లకోసారి అప్‌డెట్ చేసుకోవాలి
- నిర్లక్ష్యం వహిస్తే ప్రభుత్వ సేవలు దూరం


ఆధార్ కేంద్రాన్ని పరిశీలించి సూచనలు ఇస్తున్న ఎంపీడీఓ వెంకటరమణయ్య(ఫైల్)

ఎర్రగుంట్ల : ఇక అన్నింటికీ ఆధార్ తప్పనిసరని యూనిక్ ఐడెంటిఫికేషన్ అథారిటీ ఆఫ్ ఇండియా(యూఐడీఏఐ) అంటోంది. పుట్టిన పిల్లల నుంచి వృద్ధులవరకూ ప్రతి పనికీ ఆధార్ తప్పనిసరి అంటోంది. అతిముఖ్యమైన డాక్యుమెంట్లలో ఇది ప్రధానమైంది. పాన్‌కార్డు, బ్యాంక్ అకౌంట్ తదితరాలతో పాటు ప్రభుత్వ పథకాలకు దరఖాస్తు చేసుకోవాలన్న ఆధార్ కార్డు కచ్చితంగా ఉండాల్సిందే. అయితే ఆధార్ కార్డు పొందిన ప్రతి ఒక్కరూ పదేళ్లకోసారి గుర్తింపు కార్డు, అడ్రస్ ప్రూఫ్‌ను సమర్పించి సెంట్రల్ ఐడెంటిటీస్ డేటా రిపాజిటరీ (సీఐడీఆర్)లోని వివరాలు అప్‌డెట్ చేసుకోవాల్సి ఉంటుంది. ఈ సేవలను ఉచితంగా యూఐడీఏఐ కల్పిస్తోంది. అయితే ప్రతి ఒక్కరికీ ఆధార్ ఉండాలని ఐదేళ్ల కిందట తీసుకున్నవారు వాటిని సవీకరించుకోవాలని ప్రభుత్వం పదేపదే చెబుతున్నా చాలా మంది నిర్లక్ష్యం వహిస్తున్నారు. తీరా అవసరమైనప్పుడు ఆధార్ కేంద్రాలకు పరుగులు తీస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసే సంక్షేమ పథకాలు పొందేందుకు ఆధార్ తప్పనిసరి. ఆధార్‌లో పొరపాట్లు ఉంటే ఉద్యోగులు, వ్యాపారులకు ఇబ్బందులు తప్పవు. ప్రస్తుతం విద్యార్థులకు ఆపార్ నమోదు ప్రక్రియ చేపడుతున్నారు. దీంతో అత్యవసరంగా ఆధార్‌లో సవరణలు చేయించుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. కేంద్ర మానవ వనరుల మంత్రిత్వశాఖ విద్యార్థులందరికీ ఆపార్ నమోదు తప్పనిసరి చేయడం వల్ల జిల్లా వ్యాప్తంగా ఈ ప్రక్రియ చేపడుతున్నారు.

**డిసెంబర్ 14 వరకు అవకాశం**

ప్రభుత్వ ఆధార్‌కు సంబంధించిన సేవలను ప్రజలకు అందించేందుకు జిల్లాలోని అన్ని మండలాలలో కేంద్రాలను ఏర్పాటు చేసింది. ఎర్రగుంట్ల మండలంలో కూడా అన్ని గ్రామ పంచాయతీలలో ఆధార్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. అయితే ఆధార్ కేంద్రాలు సక్రమంగా పని చేయకపోవడంతో ప్రజలు సమస్యలను ఎదుర్కొంటున్నారు. పోస్టాఫీస్‌లో కూడా ఆధార్ సంబంధిత సేవలను పొందవచ్చునని ఇండియా పోస్ట్ తన వెబ్‌సైట్‌లో తెలిపింది. ఆధార్ వివరాలను పదేళ్లకోసారి అప్‌డెట్ చేసుకోవాలని యూఐడీఏఐ గతంలో ప్రకటించింది. అప్పటినుంచి పలుమార్లు గడువు పొడగిస్తూ వస్తోంది. ఈ ఏడాది డిసెంబర్ 14వ తేదీ వరకు ఈ అవకాశం ఉంటుందంటున్నారు. అంతేకాకుండా ఆధార్ కార్డులో చిన్న మార్పులు చేసుకోవాల్సిన వారు కూడా చేసుకోవచ్చునన్నారు. కార్డు దారు పేరు, పుట్టిన తేదీ చిరునామా వంటి అంశాల్లో మార్పులు చేర్పులు చేసుకోవచ్చు.




**అవకాశం సద్వినియోగం చేసుకోండి**



కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసే సంక్షేమ పథకాలను పొందేందుకు ఆధార్ తప్పనిసరి, ఆధార్ చేయించుకుని పదేళ్లు పూర్తైన వారు తమ కార్డులను అప్‌డెట్ చేయించుకోవాలి. సాంకేతిక తప్పిదాలుంటే సరి చేసుకోవాలి, ఇలా చేయకపోతే అర్హులు సైతం సంక్షేమ ఫలాలకు పొందలేరు. ఆధార్ కార్డులు అప్‌డెట్ చేసుకునేందుకు మండలంలోని అన్ని సచివాలయాలలో ఆధార్ కేంద్రాలు అందుబాటులో ఉన్నాయి. వాటిని సద్వినియోగం చేసుకోండి.

– వెంకటరమణయ్య, ఎంపీడీఓ, ఎర్రగుంట్ల

## నేడు పింఛన్ల పంపిణీ

సింహాద్రిపురం : మండల వ్యాప్తంగా శనివారం పింఛన్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ కృష్ణమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. డిసెంబర్ 1వ తేదీ ఆదివారం కావడంతో ఈనెల 30వ తేదీ శనివారం పింఛన్లు పంపిణీ చేస్తామన్నారు. లబ్ధిదారులు గమనించాలన్నారు.

## బహిరంగ వేలం పాట ద్వారా రూ.54,000 ఆదాయం


పట్టుబడిన వాహనాలకు బహిరంగ వేలం వేస్తున్న ఎక్సైజ్ శాఖ అధికారులు

పులివెందుల టౌన్ : పట్టణంలోని ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్‌లో శుక్రవారం జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ అధికారి రవికుమార్ ఆధ్వర్యంలో పట్టుబడిన వాహనాలకు బహిరంగ వేలం పాట వేయడం జరిగిందని ఎక్సైజ్ సీఐ చెన్నారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టుబడిన వాహనాలకు బహిరంగ వేలం పాట ద్వారా రూ.54,070లు ఆదాయం సమకూరిందన్నారు. అలాగే జీఎస్టీ 18 శాతం కూడా విధించడం జరిగిందన్నారు.

## క్లుప్తంగా

### రేపు ప్రముఖ వైద్య నిపుణులు రాక

పులివెందుల టౌన్ : పట్టణంలోని స్థానిక భాకరాపురంలో ఉన్న దినేష్ మెడికల్ సెంటర్(గంగిరెడ్డి ఆసుపత్రి)లో ఆదివారం ప్రముఖ వైద్య నిపుణులు రానున్నట్లు ఆసుపత్రి డాక్టర్ ఇసీ దినేష్‌రెడ్డి తెలిపారు. చర్మవ్యాధుల ప్రముఖ వైద్య నిపుణురాలు డాక్టర్ ఎస్.సౌజన్య సోరియాసిస్, తామర, గజ్జి, ఫంగస్ ఇన్‌ఫెక్షన్, మొటిమలు, బెదులు, దద్దుర్లు, చుండ్రు తదితర చర్మ వ్యాధులకు వైద్య పరీక్షలు నిర్వహించనున్నారు. ప్రముఖ న్యూరో సర్జన్ డాక్టర్ క్రాంతి కుమార్ మెదడు, వెన్నముక, నరాలు, తిమ్మిర్లు, వంటి ఒళ్లు నొప్పులకు వైద్య చికిత్సలు అందిస్తారన్నారు. ఈ అవకాశాన్ని పులివెందుల ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9963170177, 08568286189 అనే ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు.

### రేపు సాంస్కృతిక కార్యక్రమాలు

పులివెందుల టౌన్ : పట్టణంలోని ఉలిమెల్ల రోడ్డులో ఉన్న శిల్పారామంలో ఆదివారం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు శిల్పారామ ఏఓ సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా పులివెందులకు చెందిన శ్రీరాజా కళా నిలయం చిన్నారులచే సాంస్కృతిక ప్రదర్శనలు ఉంటాయన్నారు. పట్టణ ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కోరారు.

### పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థుల ప్రతిభ


ప్లేస్‌మెంట్ పొందిన విద్యార్థులతో అధ్యాపకులు

కమలాపురం : స్థానిక పాలిటెక్నిక్ కళాశాలకు చెందిన 14 మంది విద్యార్థులు ప్రతిభ చాటి ఉద్యోగాలకు ఎంపికయ్యారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో స్కిల్ హబ్ ఆధ్వర్యంలో జాబ్ మేళా ఏర్పాటు చేశారు. ఈ మేళాకు ఏఐఎల్ డిక్సన్ టెక్నాలజీస్‌తో పాటు మరి కొన్ని సంస్థలు వచ్చాయి. అయితే కేవలం ఇదే కళాశాలకు చెందిన ఈసీఈ విభాగానికి చెందిన 9 మంది విద్యార్థులు, ట్రిపుల్ ఈ విభాగానికి చెందిన 5 మంది విద్యార్థులు ప్రతిభ కనబరిచి డిక్సన్ టెక్నాలజీస్‌లోని ఉద్యోగ అవకాశాలు పొందారు. ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపక బృందం అభినందించారు. కార్యక్రమంలో కళాశాల ప్లేస్‌మెంట్ అధికారి రామకృష్ణారెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు, కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

### సమాజంలో స్త్రీలను గౌరవించాలి


మాట్లాడుతున్న ఐసీడీఎస్ సీడీపీఓ శ్రీలత

పులివెందుల రూరల్ : సమాజంలో స్త్రీలను గౌరవించాలని ఐసీడీఎస్ సీడీపీఓ శ్రీలత తెలిపారు. శుక్రవారం స్థానిక న్యాక్ లోని ట్రైనింగ్ సెంటర్‌లో ఇంజనీర్ ఆర్‌ఏసీడబ్ల్యూ శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఆమె లింగ ఆధారిత హింస, నిర్మూలన గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో నాక్ అసిస్టెంట్ డైరెక్టర్ రాకేష్, సెంటర్ ఇన్‌చార్జి చెన్నకేశవ, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

### జాబ్ మేళాకు స్పందన


మాట్లాడుతున్న ప్రిన్సిపాల్

జమ్మలమడుగు రూరల్ : మండలంలోని అంబవరం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఎంప్లాయిమెంట్ ఎక్స్చేంజ్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్ మేళాకు విశేష స్పందన లభించింది. శుక్రవారం పాలిటెక్నిక్ కళాశాలలో విద్యార్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. 75 మంది విద్యార్థులు హాజరు కాగా 38 మంది ఎంపికయ్యారు. కళాశాల ప్రిన్సిపాల్ సురేంద్రనాథ్‌రెడ్డి మాట్లాడుతూ ఇటువంటి జాబ్ మేళాలు జిల్లాలో ప్రతి నెల ఒక నియోజకవర్గంలో జరుగుతుందన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

### నేడు గ్రామోత్సవం

చెన్నూరు(వల్లూరు) : మండలంలోని ఉప్పరపల్లెలో శనివారం అయ్యప్పస్వామి గ్రామోత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నట్లు గురుస్వామి ఆవులనాగ మల్లారెడ్డి తెలిపారు. ఇందులో భాగంగా స్థానిక నాగనాథేశ్వరస్వామి ఆలయంలో ఉదయం స్వామివారికి అభిషేకాలు అనంతరం పడిపూజ, లక్షార్చన కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు. మధ్యాహ్నం అన్న సంతర్పణ కార్యక్రమం ఉంటుందన్నారు.

## పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోండి


ఆర్టీసీ బస్టాండు సమీపంలో పూడికతీత పనులను పరిశీలిస్తున్న కమిషనర్ జగన్నాథ్

కమలాపురం : ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని కమలాపురం నగర కమిషనర్ పగడాల జగన్నాథ్ తెలిపారు. శుక్రవారం స్థానిక ఆర్టీసీ బస్టాండు సమీపంలో జరుగుతున్న డ్రైనేజ్ కాలువ నుంచి పూడికతీత పనులు పరిశీలించారు. ప్రజలకు ఇబ్బంది కలగకుండా త్వరితగతిన పూడికతీత పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు డ్రైనేజ్ కాలువల్లో చెత్తా చెదారం వేయవద్దన్నారు. కేవలం మురికి నీరు మాత్రమే వెళ్లేలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కాలువలు పూడిపోతే మురికి నీరంతా బయటకు వచ్చే అవకాశం ఉందన్నారు. ప్రజలు గమనించి పరిశుభ్రత పాటించడంతో పాటు మురికి నీరు మాత్రమే డ్రైనేజ్‌లో వెళ్లేలా చూడాలన్నారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ బాల నరసింహులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఇ-క్రాప్ నమోదు తప్పనిసరిగా చేసుకోవాలి


వల్లూరులో ఇ క్రాప్ నమోదును పరిశీలిస్తున్న ఏడీఏ నరసింహారెడ్డి

వల్లూరు : రబీలో పంటలు సాగు చేసిన రైతులందరూ తప్పనిసరిగా ఇ క్రాప్ నమోదు చేసుకోవాలని కమలాపురం వ్యవసాయ సహాయ సంచాలకులు నరసింహారెడ్డి తెలిపారు. మండలంలోని వల్లూరు గ్రామ పొలాల్లో జరుగుతున్న ఈ క్రాప్ నమోదు కార్యక్రమాన్ని శుక్రవారం ఆయన పరిశీలించి మాట్లాడారు.

పంటల బీమా, పంట నష్ట పరిహారం, సున్నా వడ్డీ, పంట రుణాలు, మద్దతు ధరతో ధాన్యం కొనుగోలు తదితర ప్రభుత్వ పథకాలు అందాలంటే రైతులు తప్పని సరిగా ఇ క్రాప్ నమోదు చేసుకోవాల్సి వుంటుందన్నారు. పంటలు సాగు చేసిన రైతులు ప్రీమియం చెల్లించి పంటల బీమా చేయించుకోవాలన్నారు. మండల వ్యవసాయ శాఖ అధికారి సాయిజ్యోతి మాట్లాడుతూ రైతులు ఇ క్రాప్, పంటల బీమా చేయించుకున్న పంటల విస్తీర్ణంలో తేడాలు వుండకూడదని తెలిపారు. కార్యక్రమంలో విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ సురేఖ, రైతులు పాల్గొన్నారు.

**పంట నమోదు తప్పనిసరిగా చేయించాలి**

పెండ్లిమర్రి : రబీలో పంటలు సాగు చేసిన ప్రతి రైతు పంట నమోదు తప్పని సరిగా చేయించాలని వ్యవసాయాధికారి ఓబులేసు తెలిపారు. శుక్రవారం మండలంలోని ఇసుకపల్లె, మొయిళ్లకాల్వ, రంపతాడు గ్రామ పొలాల్లో పంట నమోదును ఆయన పరిశీలించి మాట్లాడారు. పంట నమోదు చేయకపోతే ఇన్సూరెన్స్, ఇన్‌పుట్‌సబ్సిడీలు రావన్నారు. పంట సాగు చేసిన ప్రతి ఎకరా పంట నమోదు చేయాలన్నారు. మండలంలో ఇప్పటి వరకు 5200 ఎకరాలల్లో వివిధ రకాల పంటలు సాగు చేశారన్నారు. ముందుగా పంట నమోదు గురించి క్షేత్రస్థాయిలో సిబ్బందికి సలహాలు, సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో ఏఈఓ గంగాధర్‌రెడ్డి, వీహెచ్‌ఏలు సుధీర్‌కుమార్, నాగలక్ష్మి, రైతులు పాల్గొన్నారు.

## ప్రకృతి వ్యవసాయ పంటల పరిశీలన


పొలాలను సందర్శిస్తున్న సుస్థిర వ్యవసాయ కేంద్ర సిబ్బంది

వేముల : మండలంలోని వేముల, బెస్తవారిపల్లె, మబ్బుచింతలపల్లె, భూమయ్యగారిపల్లె గ్రామాల్లో సేంద్రీయ వ్యవసాయం చేస్తున్న రైతుల పొలాలను శుక్రవారం హైదరాబాద్ సుస్థిర వ్యవసాయ కేంద్ర ప్రొగ్రాం మేనేజర్ రాంప్రసాద్ పరిశీలించి మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో కూడా ఆసక్తిగల రైతులను ప్రోత్సహించి శిక్షణలు ఏర్పాటు చేసి వారి ద్వారా సేంద్రీయ వ్యవసాయాన్ని పోత్సహిస్తామన్నారు. అలాగే ప్రకృతి వ్యవసాయ కో ఆర్డినేటర్ శివార్జునరెడ్డి మాట్లాడుతూ వేముల రైతు ఉత్పత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో సేంద్రీయ వ్యవసాయానికి కావాల్సిన కషాయాలు, ద్రావణాలు, ఇన్పుట్ పరికరాలు అందుబాటులో ఉంటాయన్నారు. ప్రొగ్రాం ఆఫీసర్లు రవి, రమణ, తదితరులు పాల్గొన్నారు.

## పద్మావతమ్మ సేవలు మరువలేనివి


పద్మావతమ్మను సత్కరిస్తున్న వైద్యాధికారి మహ్మద్ తాహా, మండల అధ్యక్షుడు రఘునాథ్‌రెడ్డి

వీరపునాయునిపల్లె : స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో హెల్త్ సైపర్‌వైజర్‌గా విధులు నిర్వహిస్తూ పదవీవిరమణ చేసిన అంబటి పద్మావతమ్మ సేవలు మరువలేనివని మండల వైద్యాధికారి మహమ్మద్ తాహా తెలిపారు. శుక్రవారం ఆసుపత్రి ప్రాంగణంలో పదవీ విరమణ సభ ఏర్పాటు చేశారు. మండల అధ్యక్షుడు రఘునాథ్‌రెడ్డి హాజరై ప్రసంగించారు. పద్మావతమ మాట్లాడుతూ పదవీవిరమణ చేసి సంతోషంగా ఉండొచ్చని ఒక ప్రక్క, ఒక పెద్ద కుటుంబాన్ని వదిలి వెలుతున్నాని మరో ప్రక బాదగా ఉందన్నారు. విధుల్లో లేక పోయినా నిత్యం మీకు నావంతు సహాయ సహకారాలు అందిస్తానని ఎప్పుడైన పోన్ చేయ్యొచ్చని ఆమె సిబ్బందికి చూసించారు. అనంతరం ఆమెను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వేంపల్లె, తాళ్లపల్లె వైద్యాధికారులు, స్థానిక సీహెచ్‌ఓ రంగానాథ్, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

## వైభవంగా అయ్యప్పస్వామి గ్రామోత్సవం


ప్రత్యేకలంకరణలో శ్రీ అయ్యప్పస్వామి


గ్రామోత్సవంలో ఊరేగింపుగా వస్తున్న అయ్యప్పస్వామి

ఎర్రగుంట్ల : పట్టణంలోని కడప రోడ్డులో వెలసిన శ్రీ హరిహర పుత్ర అయ్యప్పస్వామి దేవస్థానంలో శుక్రవారం సాయంత్రం అయ్యప్పస్వామి గ్రామోత్సవం వైభవంగా జరిగింది. గణపతి స్వామి, సుబ్రమణ్యంస్వామి, అయ్యప్పస్వామి ఉత్సవ విగ్రహాలను అలంకరించి రథంలో ప్రతిష్ఠించారు. పురవీధులలో మహిళలచే దీపాలు పట్టుకుని కేరళ వాయిద్యాలతో స్వామి వారి ఊరేగింపు జరిగింది. లడ్డు లక్కి డ్రిప్ తీయగా కౌన్సిలర్ తుంగా వెంకట్రామిరెడ్డి దక్కింది.

## పోటీతత్వం అలవరచుకోవాలి


విద్యార్థులకు నగదు బహుమతి అందజేసిన ఖాదర్‌బాషా

కమలాపురం : ప్రతి విద్యార్థి పోటీ తత్వం అలవరచుకోవాలని మైనార్టీ జిల్లా నాయకుడు ఖాదర్ బాషా తెలిపారు. శుక్రవారం ఏకలవ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన మండల స్థాయి క్విజ్ పోటీల్లో స్థానిక జడ్పీ బాయ్స్ హైస్కూల్ విద్యార్థులు విజేతలుగా నిలిచారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులకు సొంత నిధులతో నగదు బహుమతులు అందజేశారు. అలాగే జిల్లాస్థాయి పోటీల్లో సైతం రాణించాలని సూచించారు. మీలో ఉన్న ప్రతిభ నిరూపించుకోవడానికి ఇలాంటి పోటీలను వేదికగా మలచుకోవాలన్నారు. ప్రతి సారి తమ పాఠశాల విద్యార్థులకు ఏదో రూపంలో సాయం చేస్తున్నారని హెచ్‌ఎం, ఉపాధ్యాయులు ఖాదర్‌బాషాకు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో ఏకలవ్య మండల కన్వీనర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## గండిలో ప్లాస్టిక్ కవర్లు వాడితే జరిమానా

చక్రాయపేట : పాపాఘ్ని నది పరి రక్షణ నిమిత్తం ప్లాస్టిక్ కవర్ల వాడకాన్ని నిషేధించేలా చర్యలు చేపట్టినట్లు ఆలయ సహాయ కమిషనర్ వెంకటసుబ్బయ్య తెలిపారు. డిసెంబరు 1వ తేదీ నుంచి గండిలో కొబ్బరికాయలు, పూల దండలు విక్రయించు వారితో పాటు దుకాణాల్లోనూ, హోటళ్లలో ఎవరైనా ప్లాస్టిక్ కవర్లు వాడితే జరిమానాలు విధిస్తామన్నారు. తమ తనిఖీల్లో ఎవరైనా ప్లాస్టిక్ కవర్లు వాడుతూ పట్టుబడితే తొలిసారిగా రూ.రెండు వేలు జరిమానా విధిస్తామన్నారు. రెండవ సారి పట్టుబడితే రూ.5వేలు వేస్తామన్నారు. అప్పటికీ వారిలో మార్పు రాకుండా ప్లాస్టిక్ కవర్లు వాడితే వారి షాపులను సీజ్ చేసి దేవస్థానం వారు స్వాధీనం చేసుకుంటారన్నారు. ప్లాస్టిక్ కవర్లకు బదులుగా బయోడిగ్రేడబుల్ కవర్లు, గుడ్డ కవర్లు మాత్రమే వాడాలన్నారు. కొబ్బరికాయల విక్రయదారులు వెదురుబుట్టలను వాడుకోవచ్చునన్నారు. దుకాణాల పర్యవేక్షణ నిమిత్తం నలుగురు సిబ్బందిని నియమించి నట్లు ఆయన తెలిపారు.

## ఎయిడ్స్‌పై అవగాహన కలిగి ఉండాలి


ఎయిడ్స్ వ్యాధి నివారణపై అవగాహన కల్పిస్తున్న ప్రభుత్వ వైద్యురాలు మల్లేశ్వరమ్మ

వేంపల్లె : ఎయిడ్స్‌పట్ల విద్యార్థులు అవగాహన కలిగి ఉండటమే నివారణ మార్గమని ప్రభుత్వ వైద్యురాలు డాక్టర్ మల్లేశ్వరమ్మ తెలిపారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో ఎయిడ్స్‌పట్ల అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎయిడ్స్ వ్యాధి అంటురోగం కాదని అది అంటించుకొనే వ్యాధి అన్నారు. ఎయిడ్స్ వ్యాధి రావడానికి కారణాలను వివరించారు. కార్యక్రమంలో సిహెచ్‌ఓ శంకరమ్మ, కళాశాల ప్రిన్సిపాల్ సి.యోగాంజనేయులు, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ ఓబుళరెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

## సుందరేశ్వరుడికి అన్నాభిషేకం


ప్రత్యేక అలంకరణలో సుందరేశ్వరస్వామి

జమ్మలమడుగు రూరల్ : ప్రముఖ పుణ్యక్షేత్రమైన కన్యతీర్థంలో కార్తీక మాసం చివరి శుక్రవారం సందర్భంగా సుందరేశ్వరస్వామికి అన్నాభిషేకం నిర్వహించారు. అనంతరం స్వామి వారికి విశేష పూజలు నిర్వహించారు. అనంతరం వచ్చిన భక్తులకు తీర్థ ప్రసాదములు ప్రధానం చేశారు.

## సమాజ సేవలో ముందుండాలి


దుప్పట్లు పంపిణీ చేస్తున్న ఎస్ఐ ప్రతాప్‌రెడ్డి

కమలాపురం : నేటి యువకులందరూ సమాజ సేవలో ముందుండాలని ఎస్ఐ ప్రతాప్‌రెడ్డి తెలిపారు. గురువారం అర్ధరాత్రి మదర్ థెరిసా సేవా సమితి ఛారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ జూటూరు విజయ్ కుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుప్పట్లను రైల్వేగేటు, బస్టాండు, క్రాస్ రోడ్డు, ప్రధాన కూడళ్లలో రోడ్లపై నిద్రిస్తున్న అభాగ్యులు, అనాథలు, నిరాశ్రయులు, యాచకులు తదితరులకు ఎస్ఐ చేతులు మీదుగా అందజేశారు. ఎస్ఐ మాట్లాడుతూ చలి కాలంలో రోడ్లపై నిద్రిస్తున్న నిరాశ్రయులు పడుతున్న కష్టాలు, బాధలను చూసి ప్రతి ఒక్కరు తమ సంపాదనలో ఎంతో కొంత ఇలాంటి కార్యక్రమాలకు వినియోగించాలన్నారు. ట్రస్ట్ చైర్మన్ విజయ్ మాట్లాడుతూ ప్రతి సం.లాగే ఈ ఏడాది కూడా దాతల సహకారంతో 30 మంది నిరాశ్రయులకు దుప్పట్లు పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

## రాయితీతో డ్రిప్ పరికరాలను అందిస్తాం


మాట్లాడుతున్న ఏపీఎంఐపీ పీడీ వెంకటేశ్వరరెడ్డి

పులివెందుల టౌన్ : 5 ఎకరాల్లోపు ఉన్న రైతులకు 90 శాతం, 5 నుంచి 10 ఎకరాల్లోపు రైతులకు 70 శాతం సబ్సిడీతో డ్రిప్ పరికరాలను అందిస్తామని ఏపీఎంఐపీ పీడీ వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. శుక్రవారం పట్టణంలోని మినీ సెక్రెటేరియట్‌లోని ఉద్యాన శాఖ కార్యాలయంలో రైతు సేవా సిబ్బందికి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 55 శాతం, 45 శాతం సబ్సిడీలతో రైతులకు స్ప్రింకర్లను మంజూరు చేస్తారని, ఆసక్తిగల రైతులు సమీప రైతు సేవా కేంద్రాలలో సహాయకుల ద్వారా నమోదు చేసుకోవాలన్నారు. అలాగే వ్యవసాయ శాఖ ఏడీ ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రస్తుత రబీ సీజన్‌లో క్రాప్ బుకింగ్ ప్రారంభమైనందున రైతులు తాము సాగు చేసిన పంటను నమోదు చేసి రైతులకు పంటల బీమాపై అవగాహన కల్పించాలన్నారు. హెచ్‌ఓ రాఘవేంద్రారెడ్డి మాట్లాడుతూ రైతు సేవా కేంద్రాల వారీగా నిర్దేశించిన డ్రిప్, తుంపెర సేద్యాల లక్ష్యాలను పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో వివిధ మండలాల ఏఓలు, రైతు సేవా సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలి


అవగాహన కల్పిస్తున్న మలేరియా జిల్లా అధికారిణి మనోరమ

పులివెందుల రూరల్ : ప్రతి శుక్రవారం డ్రై డే పాటించాలని మలేరియా జిల్లా అధికారిణి మనోరమ తెలిపారు. శుక్రవారం పట్టణంలోని నగరిగుట్ట, జయమ్మ కాలనీలలో ఫ్రైడే – డ్రై డే సందర్భంగా వైద్య, ఆరోగ్య శాఖ అధికారులతో కలిసి ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె ప్రజలకు దోమ కాటువల్ల వచ్చే వ్యాధుల గురించి అవగాహన కల్పించి ఆశా కార్యకర్తలు నిర్వహిస్తున్న లార్వా సర్వేను తనిఖీ చేసి మాట్లాడారు. ఆరోగ్య కార్యకర్తలు ప్రతి గ్రామాన్ని సందర్శించి జ్వరం ఉన్న వారికి రక్తపూతలు సేకరించి వారానికి రెండు సార్లు ల్యాబ్‌కు అందజేయాలని, ఎవరికైనా మలేరియా నిర్ధారణ అయితే వెంటనే చికిత్స అందించి మలేరియా వచ్చిన వ్యక్తి గ్రామంలో ఫీవర్ సర్వే, లార్వా సర్వే చేసి గ్రామంలోని ప్రజలందరికీ రక్తపరీక్షలు చేయాలన్నారు. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, దోమకాటుకు గురికాకుండా దోమ తెరలు వాడాలన్నారు. కార్యక్రమంలో మలేరియా సబ్ యూనిట్ అధికారి సిద్ధయ్య, ఎంపీహెచ్‌ఈఓ శంకర్‌రెడ్డి, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## విద్యార్థులకు ఉపయోగకరంగా రైతు సదస్సులు


మాట్లాడుతున్న కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త డాక్టర్ వీరయ్య

చింతకొమ్మదిన్నె : వ్యవసాయ విద్యార్థులు మూడు సంవత్సరాలుగా తరగతి గదిలో చదివిన అంశాలను ప్రత్యక్షంగా రైతుల పొలాలలో పరిశీలించడం, రైతులతో ఆచరింపజేయడం మంచి ఉపయోగకరంగా ఉంటుందని కృషి విజ్ఞానం కేంద్రం సమన్వయకర్త డాక్టర్ వీరయ్య తెలిపారు. శుక్రవారం కొలుములపల్లెలో ఊటుకూరు కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో మహానంది వ్యవసాయ కళాశాల నాల్గవ సంవత్సరం విద్యార్థులకు రైతు సదస్సు, వ్యవసాయ ప్రదర్శనను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కృషి విజ్ఞాన కేంద్రం రైతుల కోసం అందించే సేవలు ప్రశంసనీయమన్నారు. అనంతరం వివిధ రబీ పంటలలో సమగ్ర యాజమాన్య పద్ధతుల గురించి ఆయన తెలియజేశారు. కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ జయలక్ష్మి మాట్లాడుతూ రైతులు కృషి విజ్ఞాన కేంద్రం, ఏరువాక కేంద్రం, వ్యవసాయ పరిశోధన స్థానం, వ్యవసాయ విశ్వవిద్యాలయం అనుబంధ సంస్థల సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. దీనివల్ల ఆధునిక వ్యవసాయ పద్ధతులను పాటించి ఖర్చు తగ్గించుకుని అధిక దిగుబడులు పొందాలని సూచించారు. అలాగే రైతులు రైతు ఉత్పత్తిదారుల సంఘాల బలోపేతం చేసుకుని మధ్యవర్తుల జోక్యాన్ని తగ్గించుకోవాలని, తమ ఉత్పత్తులకు మంచి ధరలను పొందాలని సూచించారు. ఊటుకూరు వ్యవసాయ పరిశోధన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ తమ పరిశోధన స్థానం నుంచి యూటీఆర్-181 అనే వరి రకం విడుదలకు సిద్ధంగా ఉన్నదని తెలిపారు. అనంతరం రైతులు, శాస్త్రవేత్తల ముఖాముఖి కార్యక్రమంలో రైతులు అడిగిన వరి, వేరుశనగ, నువ్వులు తదితర పంటలలో వచ్చే వివిధ చీడపీడల వంటి సమస్యలకు శాస్త్రవేత్తలు నివారణ చర్యలను తెలియజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఏర్పాటు చేసిన సమీకృత వ్యవసాయ పద్ధతులు, నేల, నీటి సంరక్షణ పద్ధతులు, సోలార్ ఫెన్సింగ్, వంటి అంశాలపై ప్రతిమలను, విత్తనాలను, మోడల్స్‌ను అతిథులు తిలకించి అభినందించారు. కార్యక్రమంలో సహాయ ఆచార్యులు డాక్టర్ పీవీ గీత శిరీష, ఉద్యాన శాస్త్రవేత్త డాక్టర్ మానస, కేవీకే విస్తరణ శాస్త్రవేత్త డాక్టర్ మహేష్ బాబు, కొలుములపల్లె రైతు సేవ కేంద్రం సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

## అధ్వానంగా రహదారి


గ్రావెల్‌తో పూడ్చిన గుంత

చింతకొమ్మదిన్నె : మండల పరిధిలోని రింగ్‌రోడ్డులో సాక్షి సర్కిల్ నుంచి ఊటుకూరు రింగురోడ్డు సర్కిల్ వరకు రహదారి అధ్వానంగా మారింది. దారి పొడుగున ఏర్పడిన గుంతలతో వాహనదారులు తరుచూ ప్రమాదాల బారిన పడుతున్నారు. ఈ రహదారిపై నిత్యం రాకపోకలు సాగించే కొంతమంది గుంతలను గ్రావెల్ వేసి పూడుస్తుండటం విశేషం.